సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 19 । అక్టోబర్ । 2023



పోలీసుల సంక్షేమానికి పెద్దపీట

పోలీసుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఉదారత చాటుకున్నారు. తనదైన ముద్ర వేసేలా పలు రాయితీలు లభిస్తాయని ఆయన ప్రకటించారు. -IIలో



రాష్ట్రాన్ని ఎడారిగా మారుస్తున్న బీజేపీ

కృష్ణాజలాల పునఃపంపిణీపై గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి బీజేపీ రాష్ట్రాన్ని ఎడారిగా మారుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి అన్నారు. -IIలో

గరిష్టం/కనిష్టం
35.6/23.5

వాతావరణం

జిల్లాలో బుధవారం 23.5 – 35.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు జగనన్న చేదోడు 4వ విడత నిధులు విడుదల



కడప రూరల్: ప్రభుత్వం రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ వృత్తులపై ఆధారపడి జీవించే పేదలకు 'జగనన్న చేదోడు' పథకం ప్రవేశపెట్టింది. ఈ వృత్తులపై ఆధారపడి జీవించే అర్హులైన వారికి ప్రభుత్వం ఒక ఏడాదికి ఒకరికి రూ 10 వేల చొప్పున ప్రభుత్వం లబ్ధిదారుల్లో నిధులను జమ చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో జరిగే బహిరంగ సభలో 4వ విడత నిధులను లబ్ధి దారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ పథకం కింద జిల్లా వ్యాప్తంగా మొత్తం 16,158 మంది అర్హులు ఉన్నారు. ఒకరికి రూ 10 వేల చొప్పున మొత్తం రూ 16,15,80,000 లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానుంది.

అందరికీ ఆరోగ్యమే ధ్యేయం

కడప రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయంగా చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమం కింద చేపట్టిన వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. బుధవారం జిల్లా వ్యాప్తంగా 26 ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు జరిగాయి. వీరపునాయునిపల్లె మండలం ఉరుటూరులో జరిగిన వైద్య శిబిరంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఎర్రగుంట్ల మండలం ఇల్లూరులో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఇతర ప్రాంతాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

దసరాకు ప్రత్యేక బస్సులు



కడప కోటిరెడ్డిసర్కిల్: దసరా పండుగను పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ సంస్థ సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులను నడుపుతుందని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20 నుంచి 23వ తేదీ వరకు ఈ ప్రత్యేక సర్వీసులు తిరుగుతాయన్నారు. జిల్లాలోని ఆరు డిపోల నుంచి హైదరాబాదుకు 75, బెంగుళూరు 45, విజయవాడ 25, చెన్నై 10, తిరుపతికి 15 బస్సులు నడపనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని మరిన్ని బస్సులు నడిపేందుకు కూడా చర్యలు చేపడతామన్నారు. ఆయా బస్సుల్లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు.

వైవీయూకు ఎన్‌బీఆర్‌ఐ పరిశోధకులు



ఎన్‌బీఆర్‌ఐ పరిశోధకులకు మొక్కలు అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయాన్ని లక్నోకు చెందిన నేషనల్ బొటానికల్ రీసెర్చ్ ఆఫ్ ఇండియా (ఎన్‌బీఆర్‌ఐ) పరిశోధకులు అజయ్‌కుమార్ మిశ్రా, అమిత్‌గుప్తా, హర్షిఫాతిమా సందర్శించారు. దేశవ్యాప్తంగా మొక్కల పరిశోధన, సేకరణలో భాగంగా బుధవారం వైవీయూ బొటానికల్ గార్డెన్‌ను పరిశీలించేందుకు వచ్చారు. అంతరించి పోతున్న మొక్కల సంరక్షణ, మందు మొక్కలను పరిశీలించి అవసరమైన మొక్కలను ఎంపిక చేసుకున్నారు. వాటిని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, గార్డెన్ సంచాలకులు ఆచార్య ఎ.మధుసూధన్‌రెడ్డి చేతుల మీదుగా పరిశోధకులు అందుకున్నారు.

సైబర్ కేటుగాళ్లు

డబ్బుపై ఆశ..ఆలోచనను దూరం చేస్తోంది. సైబర్ మోసగాళ్ల వలలో చిక్కి విలవిల్లాడేలా చేస్తోంది. లాటరీ, ఆఫర్లు, ప్రైజ్‌మనీల పేరుతో.. కొంతడబ్బు ముందు కడితే అంతకు రెట్టింపు ఇస్తామంటూ సైబర్ నేరగాళ్లు వల వేసి తర్వాత లక్షలు కాజేసి నట్టేట ముంచుతున్నారు. అత్యాశకు పోయి సైబర్ కేటుగాళ్ల మాటలు నమ్మి నిలువుదోపిడికి గురయ్యే బాధితులు నానాటికీ పెరిగిపోతున్నారు. జిల్లా ఎస్పీ 'స్పందన'కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుల్లో సైబర్ నేరాలకు సంబంధించిన అర్జీలే ఎక్కువగా ఉన్నాయి.

- ఆన్‌లైన్ మోసాలతో డబ్బులు మాయం
- లక్షలు పోగొట్టుకుని తలలు పట్టుకుంటున్న బాధితులు
- విద్యావంతులే అత్యధికంగా బాధితులు
- అత్యాశకు పోతున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు
- రెప్పపాటులోనే నిలువుదోపిడీ



కడప అర్బన్: డబ్బులు ఎవరికీ ఊరికే రావు.. అన్న సామెత అందిరికీ తెలిసిందే...అయినా కొందరు అత్యాశపరులు ఊరికే వస్తున్నాయంటే ఎగబడుతున్నారు.గుడ్డిగా నమ్మి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. రెట్టింపు డబ్బులు వస్తాయని కొందరు, ప్రైజ్‌మనీ వచ్చిందని మరికొందరు ముక్కూ, ముఖం తెలియని అపరిచిత వ్యక్తుల చేతుల్లో డబ్బులు పెట్టేసి చేతులు కాల్చుకుంటున్నారు. ఒకేఒక్క 'క్లిక్'తో సైబర్ నేరగాళ్లు ఎంచక్కా డబ్బులు కాజేస్తున్నారు. తరువాత బాధితులు తమ లబోదిబోమంటున్నారు.ఇటీవల కాలంలో అనేక మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కి మోసపోవడం ఎక్కువై పోయింది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సతీమణి రూ. 17 లక్షలు పోగొట్టుకున్న వైనం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి భార్య,తన భర్తతో పాటు బెంగళూరులో హాయిగా జీవనం సాగిస్తోంది. ఆమె ప్రెగ్నెంట్ కావడంతో ప్రొద్దుటూరుకు తల్లిదండ్రుల వద్దకు కొద్ది రోజులు ఉండి వస్తాననీ చెబితే పంపించాడు. ఆమె మొబైల్ ఫోన్‌కు సైబర్‌నేరగాడు ఓ లింక్‌ను వాట్సాప్‌కు పంపించాడు. దానిని క్లిక్ చేసిన మహిళకు డబ్బు కడితే ఆఫర్ల క్రింద రెట్టింపు డబ్బులు ఇస్తామనీ చెపాడు. ఆమె తన బంగారు నగలను సైతం బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బులను సైబర్‌నేరగాడు చెప్పిన మేరకు తన ఖాతాలో డబ్బులను వేసుకుని పంపించింది. మళ్లీ సైబర్ నేరగాడు ఆమెను మభ్యపెట్టడంతో తన భర్తను బెదిరించి మరో 5 లక్షలను విడతల వారీగా తెప్పించుకుంది. తన భార్యకు డబ్బులను పంపకపోతే ఏమైనా అఘాయిత్యానికి పాల్పడుతుందనే ఆవేదనతో స్నేహితుల దగ్గర అప్పులు చేసి డబ్బులను పంపించాడు. తర్వాత తన భార్య దాదాపు రూ. 17 లక్షలు పోగొట్టుకుందనీ తెలిసి నిర్ఘాంతపోయాడు. తన భార్యకు, వారి బంధువులకు కౌన్సెలింగ్ చేసి, కడప సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు.

ఉద్యోగం పేరుతో రూ. 75వేలు టోకరా ...

ప్రొద్దుటూరుకు చెందిన ఓ యువతి తన ఇంటి వద్దనే ఉంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం కోసం ఎదురు చూస్తోంది. ఆమె మొబైల్‌ఫోన్‌కు వాట్సాప్ ద్వారా వచ్చిన లింక్‌ను టచ్ చేయగా సైబర్ నేరగాడు తన మెసేజ్‌ల ద్వారా ఎరవేశాడు. కొంత డబ్బులను కడితే రెట్టింపు జీతం వచ్చేలా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అపాయింట్‌మెంట్ మరుసటి రోజునే ఇప్పిస్తామని చెప్పాడు. బాధిత యువతి తన ఖాతాలో, చుట్టుపక్కల బంధువులను, స్నేహితులను అడిగి దాదాపు రూ. 75వేలు తన ఖాతా ద్వారా సైబర్ నేరగాడు చెప్పిన మేరకు పంపించేసింది. తరువాత సైబర్‌నేరగాడి ఫోన్ స్విచాఫ్ వచ్చింది. లబోదిబోమంటూ ఏడుస్తుండగా తల్లిదండ్రులు గమనించి ప్రొద్దుటూరులోని పోలీస్‌స్టేషన్‌కు, కడపలోని సైబర్‌క్రైమ్ విభాగంలోని అధికారులకు ఫిర్యాదు చేశారు.

పోలీసులకు తలనొప్పిగా మారుతున్న సైబర్ నేరాలు

ప్రస్తుతం జిల్లాలో పోలీస్‌స్టేషన్లకు వచ్చే కేసుల్లో ఎక్కువగా సైబర్ నేరాలకు సంబంధించినవవే ఉంటున్నాయి. ఈ కేసులను ఛేదించడం పోలీసులకు తలనొప్పిగా మారుతున్నాయి. సైబర్‌నేరగాళ్ల ఫోన్ నంబర్లను ట్రేస్ చేస్తే వాటి అడ్రస్‌లు ఎక్కడో న్యూఢిల్లీ, కర్ణాటక, కాశ్మీర్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించినవిగా ఉంటున్నాయి. ఆధునిక సాంకేతికత, పోలీసు అధికారుల సహకారం ఉన్నప్పటికీ దర్యాప్తు కష్టంగా వుంటోంది. . సైబర్ నేరగాళ్లు తాము దోచుకున్న డబ్బులను రెప్పపాటు కాలంలో తమ పరిధిలోని బంధువులు, స్నేహితుల ఖాతాల్లోకి 10 నుంచి 20 ఖాతాల్లోకి బదలాయించేస్తున్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్‌నేరాలకు చెక్ పెట్టలేకపోతున్నారు. కానీ ఇటీవల గుజరాత్ రాష్ట్రంలో అక్కడి కోర్టుల ఆదేశాల మేరకు సైబర్‌నేరగాళ్లు దోచుకున్న డబ్బులను వారివారి బ్యాంక్ ఖాతాల ద్వారా ఫ్రీజింగ్ చేయించి రికవరీ చేసేలా చర్యలు చేపట్టినట్లు పోలీసు అధికారుల ద్వారా వచ్చిన సమాచారం. దేశ వ్యాప్తంగా ఇదే పద్ధతిలో అమలు చేసే విధంగా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళితే కొంతమేరకైనా సైబర్ నేరాలకు చెక్ పెట్టే అవకాశాలున్నాయని ప్రజలు భావిస్తున్నారు.

నాలుగు రోజుల్లో రూ.24 లక్షలు పోగొట్టుకున్న ప్రభుత్వ ఉద్యోగి

కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ఓ ఉన్నత శ్రేణి ప్రభుత్వ ఉద్యోగి తన మొబైల్‌కు 'వాట్సాప్'ద్వారా వచ్చిన లింక్ ఆధారంగా డబ్బులు కడితే రెట్టింపు వస్తాయని ఆశ చూపడంతో విడతలవారీగా డబ్బులను చెల్లించాడు. ఏకంగా నాలుగు రోజుల పాటు తన బ్యాంక్ ఖాతా నుంచి సైబర్ నేరస్తుడికి దాదాపుగా 24 లక్షలు వేశాడు. తన బ్యాంక్ ఖాతానుంచి డబ్బులను ట్రాన్స్‌ఫర్ చేసిన ప్రతిసారీ బ్యాంక్ రసీదు కూడా రావడంతో తనకు డబ్బులు వస్తాయనే భ్రమతో కడుతూ వెళ్లాడు. తన బ్యాంక్ ఖాతాలోని డబ్బులన్నీ అయిపోగానే అవతల వైపు నుంచి వాట్సాప్, ఇతర యాప్‌ల ద్వారా వచ్చే మెసేజెస్, కాల్స్ నిలిచిపోయాయి. తాను మోసపోయానని గ్రహించిన సదరు ప్రభుత్వ ఉద్యోగి 'స్పందన'కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి సైబర్ క్రైమ్ విభాగానికి బదిలీ చేశారు. వారి సిఫారసు మేరకు కడప తాలూకా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామనీ పోలీసులు తెలియజేశారు.

అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ



సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పేర్కొన్నారు. ఏఈపీఎస్ (ఆధార్ ఎనేబుల్ పేమెంట్ సిస్టమ్) ద్వారా వేలిముద్రలను ఉపయోగించి మీ ఖాతా నుంచి డబ్బులను డ్రా చేసుకుంటారన్నారు. సైబర్‌నేరగాళ్ల బారినపడ్డ బాధితులు నేషనల్ సైబర్ క్రై మ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేసేందుకు టోల్‌ఫ్రీ నెం.1930కు ఫిర్యాదు చేయడం కీలకమనీ సూచించారు.

వైద్యవిద్య ఉన్నతమైనది



కడప రిమ్స్ ఫ్రెషర్స్‌డేలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, అధికారులు

కడప అర్బన్: వైద్య విద్యాభ్యాసం నిరంతరమైనది...సమాజంలో ఉన్నతమైందని కడప ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల(రిమ్స్) ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ అన్నారు. 2023–24 వైద్య విద్యను అభ్యసించేందుకు విచ్చేసిన వైద్య విద్యార్థులకు కళాశాల కాన్ఫరెన్స్‌హాల్‌లో ఫ్రెషర్స్‌డే, వైట్‌కోట్ వేడుకను 2020 బ్యాచ్ వైద్య విద్యార్థులు బుధవారం ఘ నిర్వహించారు. జ్యోతిప్రజ్వలనతో వేడుకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ మాట్లాడుతూ సమాజంలో వైద్యులను ప్రాణదాతలుగా చెప్పుకుంటారని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో వైద్య విద్యను అభ్యసించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్య విద్యార్థులు ఆరు సంవత్సరాల కాలాన్ని, కళాశాలలోని వసతుల్ని సక్రమంగా వినియోగించుకుంటూ, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. సహచర విద్యార్థులు, సీనియర్ విద్యార్థులు, ఫ్యాకల్టీ మెంబర్స్, అందరితో సఖ్యంగా మెలగాలనీ, స్నేహం, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి, వైద్యులు వైద్య విద్యార్థుల్ని అభినందిస్తూ, కళాశాలలోని ఆహ్వానించారు. వివిధ విభాగాధిపతులు, విద్యార్థులకు తెల్లకోటు వేసి, వైద్య విజ్ఞాన ప్రపంచంలోకి ఆహ్వానించారు.

ప్రొద్దుటూరు ఖ్యాతిని కించపరచొద్దు

- స్వలాభం కోసమే ప్రవీణ్ విమర్శలు
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు: ఘన చరిత్రగల ప్రొద్దుటూరు ఖ్యాతిని దిగజార్చేలా మాట్లాడటం టీడీపీకి తగదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆధ్యాత్మిక చరిత్రతోపాటు కవులకు, కళాకారులకు నిలయంగా, వాణిజ్య కేంద్రంగా విరాజిల్లుతున్న ప్రొద్దుటూరుకు మచ్చ తెచ్చే విధంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి విమర్శలు చేశారన్నారు. గత రెండున్నరేళ్లుగా ఏదో విధంగా లబ్ధి పొందాలనే ఆశయంతో తనపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు. ఆ విమర్శలు తనతోపాటు ప్రొద్దుటూరు ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. శ్రీరామచంద్రుడు ప్రతిష్టించిన ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయం, అగస్త్యేశ్వరముని ప్రతిష్టించిన అగస్త్యేశ్వర స్వామి ఆలయం, లక్కోజి సంజీవరాయశర్మ, పుట్టపర్తి నారాయణాచార్యులు, శతావధాని సీవీ సుబ్బన్న, నరాల రామారెడ్డి లాంటి గొప్పవారు ఎందరో ఇక్కడ జన్మించారన్నారు. స్వయంగా శ్రీరామచంద్రుడే ప్రొద్దుటూరుకు పేరు పెట్టారన్నారు. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకోకుండా కేవలం షుకూర్ బిర్యాని, తంగేడుపల్లి మిఠాయి పేరు చెబుతూ విమర్శలు చేశారన్నారు. అన్ని ప్రాంతాల్లో లాగే కొద్దోగొప్పో క్రికెట్ బెట్టింగ్, మట్కా, జూదం, ఇసుక అక్రమ రవాణా లాంటి కార్యకలాపాలు సాగుతున్నాయన్నారు. వీటిని అరికట్టాలని స్వయంగా తాను ప్రజాప్రతినిధులతో కలసి ఎస్పీకి విన్నవించామని తెలిపారు. అయితే ప్రవీణ్ మాత్రం ఎక్కడా లేని విధంగా ప్రొద్దుటూరులోనే అసాంఘిక కార్యక్రమాలు ఉన్నట్లు, ప్రజలందరినీ కించపరిచేలా మాట్లాడటం తగదన్నారు. ప్రొద్దుటూరు ప్రాంతంలో ప్రత్యేకంగా ఉన్న చేనేత వృత్తిని గురించి మాట్లాడకుండా ప్రవీణ్‌కు విమర్శలే కనిపించాయా అని ఎమ్మెల్యే విమర్శించారు. తాను మంగతై ఆడిస్తున్నట్లు, మట్కా నడిపిస్తున్నట్లు, గుడ్కా ప్యాకెట్లు అమ్ముతున్నట్లు రెండేళ్లుగా విమర్శలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోనే ఎవరు కోరని విధంగా తాను సీబీఐ విచారణను కోరిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు.

- వంద మంది ప్రవీణ్ లాంటి టీడీపీ ఇన్‌చార్జిలు వచ్చినా, ఎంత మంది ఏకమైనా తాను బతికున్నంత వరకు ప్రొద్దుటూరులో టీడీపీ జెండాను ఎగరనివ్వనని, వైఎస్సార్‌సీపీ జెండా మాత్రమే రెపరెపలాడిస్తానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి స్పష్టం చేశారు. అదే లక్ష్యంతో తాను పనిచేస్తానని, ఇలాంటి విమర్శలకు కుంగిపోనన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల ఆత్మగౌరవాన్ని కాపాడుతానన్నారు. రెండున్నరేళ్లుగా ప్రజా సమస్యలను పట్టించుకోని టీడీపీ ఇన్‌చార్జి కేవలం మీడియాను ఆధారంగా చేసుకుని విమర్శిస్తున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాలు లేకుండా చూసుకోవాలి

కడప కార్పొరేషన్: జిల్లాలో పగటిపూట అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపత్యంలో విద్యుత్ అంతరాయాలు ఎక్కువగా ఉన్నాయని, విద్యుత్ సిబ్బంది లైన్లలో తిరిగి సమస్యలు గుర్తించి పరిష్కరించాలని ఏపీఎస్‌పీడీసీఎల్ కడప సర్కిల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్. రమణ అన్నారు. బుధవారం కడప డివిజన్ పరిధిలోని కడప, చింతకొమ్మదిన్నె, వల్లూరు, చెన్నూరు, పెండ్లిమర్రి మండలాల క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం కడపలోని సాయిపేట సబ్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ముందస్తు మరమ్మతులు చేసి అంతరాయాలను అరికట్టాలన్నారు. కడప డివిజన్‌లో పేరుకుపోయిన రూ.14.92కోట్లను వసూలు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న కాలనీల్లో ఎవరికైనా విద్యుత్ మీటర్ కావాలంటే యుద్ధ ప్రాతిపదికన బిగించాలన్నారు. కార్యక్రమాల్లో కడప డివిజన్ ఈఈ ఎల్ నరసింహప్రసాద్, డీఈలు ఏఏఓలు, ఏఈలు, జేఈలు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : గజలక్ష్మీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి, దర్శించుకుంటున్న భక్తులు



కడప అమ్మవారిశాలలో గజలక్ష్మిగా వాసవీ కన్యకాంబ

గజలక్ష్మీ.. నమోస్తుతే

దేవీ శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. జిల్లాలోని ఆలయాల్లో అమ్మవారిని వివిధరూపాల్లో అలంకరించారు. రెండో మైసూరుగా పేరుగాంచిన ప్రొద్దుటూరు, కడపలోని అమ్మవారిశాలలో బుధవారం అమ్మవారు గజలక్ష్మీ దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్

పదివేలు దాటిన పసుపు ధర



కడప మార్కెట్‌యార్డుకు వచ్చిన పసుపు

కడప అగ్రికల్చర్: పచ్చ బంగారం(పసుపు) ధర క్వింటాల్ రూ. 10 వేలు దాటింది. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కడప మార్కెట్‌యార్డులో క్వింటాల్ ఫింగర్ పసుపు అత్యల్ప ధర 9850, అత్యధిక ధర రూ. 10119 పలికింది. బల్బు పసుపు అత్యల్ప ధర రూ. 9445, అత్యధిక ధర క్వింటా రూ. 10300 పలికింది.

క్లుప్తంగా

వరకట్న వేధింపుల కేసు

కడప అర్బన్ : డబ్బు, బంగారం తీసుకురావాలంటూ తనను భర్త, ఆయన కుటుంబీకులు వేధిస్తున్నారని కడప నగరంలోని అహ్మద్ సాబ్ వీధిలో నివాసముంటున్న మాబుషీరా వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానిక మురాదియా నగర్‌కు చెందిన సమీర్‌తో 2022లో మాబుషీరాకు వివాహమైంది. ఇటీవల కొద్ది రోజులుగా డబ్బు, బంగారం తీసుకురావాలని భర్త సమీర్‌తో పాటు మామ జహీర్ అహ్మద్, ఆడ బిడ్డలు, బంధువులు వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వన్‌టౌన్ ఎస్ఐ సిద్దయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

రెండు గడ్డివాములు దగ్ధం

జమ్మలమడుగు రూరల్ : స్థానిక శ్రీ రాంనగర్ కాలనీలోని విశ్వజ్యోతి పాఠశాల సమీపంలో రైతు మల్లెల నాగేశ్వరరెడ్డికి చెందిన రెండు గడ్డివాములు బుధవారం దగ్ధమయ్యాయి. ఆకతాయిలు సిగరెట్ తాగి సమీపంలో వేయడంతో గడ్డి వామికి నిప్పంటుకుని పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ప్రొద్దుటూరు నుంచి వాహనం వచ్చేలోగా వాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.6 లక్షల వరకు నష్టపోయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య


మృతి చెందిన ఖాజావలి

బద్వేలు అర్బన్ : బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని శివానగర్‌లో మంగళవారం రాత్రి మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు షేక్ ఖాజావలి(52) పండ్ల వ్యాపారం చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆయన భార్య మూడేళ్ల కిందట అనారోగ్యంతో మృతిచెందారు. ఇద్దరు కుమారులు, కుమార్తెకు వివాహం చేశాడు. కొన్ని నెలలుగా మద్యానికి బానిసై ఒంటరిగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన ఆయన మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఉదయం చుట్టు పక్కల వారు గమనించి ఆయన కుమారులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి గమనించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి కుమారుడు మహబూబ్‌బాషా ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ యుగంధర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫర్నిచర్ దుకాణంలో చోరీ

మైదుకూరు: పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులోని దొంతు హోంనీడ్స్ షోరూంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. రేకులను కత్తిరించి లోనికి ప్రవేశించిన దుండగులు రూ.20వేలు నగదు, ఒక సెల్ ఫోన్ చోరీ చేసినట్లు యజమాని దొంతు రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. షోరూంను క్లూస్ టీం బృందం పరిశీలించింది. కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

నిందితుడికి జైలుశిక్ష

రాయచోటిటౌన్ : ఓ మహిళను వేధించిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ రాయచోటి అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శారద తీర్పునిచ్చారు. వీరబల్లె మండలానికి చెందిన ఓ మహిళను కడపకు చెందిన మోద్రగుత్తి శివాజీ(26) ఫోన్‌లో అసభ్యకరంగా మాట్లాడడం, వాయిస్ రికార్డులు పంపుతూ బెదిరించారని తేలడంతో జడ్జి జైలు శిక్ష విధించారు.

పోలీసుల సంక్షేమానికి పెద్దపీట

- పలు దుకాణాల్లో పది శాతం రాయితీ
- సిబ్బందికి ప్రముఖ వైద్యులచే ఉచిత పరీక్షలు
- అత్యవసర చికిత్సకు ప్రత్యేక అంబులెన్స్
- సంక్షేమ కమిటీ సమావేశంలో ఎస్పీ సిద్ధార్థ్‌కౌశల్


సమావేశంలో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది (ఇన్‌సెట్) సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్ : పోలీసుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఉదారత చాటుకున్నారు. తనదైన ముద్ర వేసేలా పలు రాయితీలు లభిస్తాయని ఆయన బుధవారం ప్రకటించారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల నేపథ్యంలో స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సంక్షేమ కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. విధుల పట్ల అంకిత భావంతో పనిచేసే కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐ వరకు ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందిస్తామని, ఎస్ఐలు, ఆర్‌లు పంపే నివేదికల ఆధారంగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన ముగ్గురిని ఎంపిక చేసి ప్రతి వారం అవార్డులు అందిస్తామని ఎస్పీ తెలిపారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయనున్నామని, 8688830030 వాట్సాప్ నెంబర్‌కు ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని వెల్లడించారు. ఫిర్యాదుదారు వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. వీటితోపాటు పోలీసులకు వరాల జల్లు కురిపిస్తూ ఆయన పలు రాయితీలు ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీ(అడ్మిన్) తుషార్ డూడీ, ఏఆర్ డీఎస్పీ బి.రమణయ్య, డీపీఓ ఏఓ జ్యోతి, ఆర్ఐలు వీరేష్, సోమశేఖర్‌నాయక్, శ్రీశైల రెడ్డి ఆనంద్, శివరాముడు, రామస్వామిరాజు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

పోలీసులకు రాయితీలు

- కల్పతరు పోలీస్ వెల్ఫేర్ స్టోర్‌లో అదనంగా పది శాతం రాయితీ
- పుష్పగిరి పోలీస్ గ్యాస్ ఏజెన్సీలో సిలిండర్‌పై 10 శాతం రాయితీ
- సిబ్బంది ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు అందజేత
- ఉమేష్‌చంద్ర కళ్యాణ మండపం అద్దెలో పది శాతం రాయితీ
- పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని 'హ్యాపీ కిడ్స్ స్కూల్'లో అమరులైన పోలీసుల పిల్లలకు వంద శాతం ఫీజు రాయితీ.
- పోలీసుల పిల్లలకు ఉచితంగా గణితం, ఆంగ్లం, కంప్యూటర్‌పై శిక్షణ
- విధి నిర్వహణలో మృతి చెందిన వారికి రూ.2.5లక్షల సాయం
- పోలీస్ కో ఆపరేటివ్ సొసైటీ రుణాలపై వడ్డీరేటు తగ్గింపు

పోలీసులకు ఎస్పీ ప్రశంస

గంజాయి కేసులో నిందితుడిని పట్టుకున్న కడప తాలూకా పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్.నాగరాజు, కానిస్టేబుల్ వై.ఓబులేసులను ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ బుధవారం ప్రశంసించారు. నాన్ బెయిలబుల్ వారంట్ ఉన్నా.. ఓ గంజాయి నిందితుడు గత కొద్దిరోజులుగా తప్పించుకు తిరుగుతున్నాడు అతడిని చాకచక్యంగా పట్టుకుని కోర్టులో హాజరు పరిచిన సిబ్బందిని ఎస్పీ అభినందిస్తూ ప్రశంసా పత్రం అందజేశారు.

చెన్నైలో బద్వేలు వాసి మృతి

- మృతుడు గవర్నర్ భద్రతా విభాగంలో కమాండో
- తమిళనాడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు


మృతిచెందిన మనోహర్ (ఫైల్)


సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న తమిళనాడు పోలీసు సిబ్బంది

బద్వేలు అర్బన్ : తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి భద్రతా విభాగంలో కమాండో(ఎస్ఐ స్థాయి)గా పనిచేస్తున్న బద్వేల్ వాసి గురజాల మనోహర్(60) మంగళవారం చెన్నైలో గుండెపోటుతో మృతిచెందారు. తమిళనాడు ప్రభుత్వ లాంఛనాలతో బద్వేల్‌లో బుధవారం మనోహర్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. బద్వేల్‌కు చెందిన మనోహర్ 40 ఏళ్లుగా వివిధ ప్రాంతాల్లో ఎన్ఎస్‌జీ కమాండోగా పనిచేశారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత భద్రతా సిబ్బందిలో పని చేసిన ఆయన గత కొన్నేళ్లుగా తమిళనాడు గవర్నర్ వద్ద పనిచేస్తున్నారు. ఇతడికి భార్య సుధారాణి, కుమారుడు ఉన్నారు. మంగళవారం చెన్నైలో గుండెపోటు రావడంతో అకస్మాత్తుగా మృతిచెందాడు. అక్కడి సిబ్బంది ప్రత్యేక వాహనంలో మృతదేహాన్ని బద్వేల్‌కు తీసుకువచ్చి తమిళనాడు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి చేశారు. అంత్యక్రియల్లో తమిళనాడు గవర్నర్ భద్రతా సిబ్బంది కమాండోలు రాజేందర్ రెడ్డి, రాజన్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


ప్రమాదంలో మృతి చెందిన సంజీవ


గాయాలతో బయటపడిన కూలీలు

కమలాపురం : పట్టణ శివారులోని రామచంద్రాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు గుంజ సంజీవ(9) బుధవారం మృతి చెందారు. ఎస్ఐ చిన్న పెద్దయ్య, స్థానికుల సమాచారం మేరకు.. మైదుకూరు పట్టణానికి చెందిన మారెన్న, మౌనికల కుమారుడు సంజీవ దసరా సెలవులు కావడంతో రామచంద్రాపురంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చారు. స్థానిక దుకాణంలో సరకులు తీసుకుని ఇంటికి వెళ్తుండగా ఎర్రగుంట్ల వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొంది. శరీరం ఛిద్రమైన బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అక్కడికి చేరుకుని విచారించారు. బాలుడు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. బాలుడి మృతితో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బోల్తా పడిన ట్రాక్టర్

సింహాద్రిపురం : మండలంలోని కొండాపురం నుంచి గురిజాల సమీపాన ఉన్న వెంకటాంపల్లె గ్రామానికి ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సింహాద్రిపురం సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తా పడడంతో ఈ ప్రమాదం జరిగింది. అందులో వెళ్తున్న నలుగురికి స్వల్పగాయాలయ్యాయి.

తురకపల్లెలో నాటుబాంబు కలకలం

పెద్దమండ్యం : మండలంలోని తురకపల్లెలో నాటు బాంబు కలకలం స్థానికులను ఆందోళన రేకెత్తించింది. తురకపల్లె పసలబండకు సమీపంలోని నల్ల గుట్ట, వెలిగింటి కొండలలో అడవి పందులు ఎక్కువగా ఉన్నాయి. వేటగాళ్లు నాటుబాంబులు పెట్టి అడవి పందులను మట్టుబెట్టి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి కాలనీకి అతి సమీపంలో నాటుబాంబులు పెట్టడంతో కుక్క నోటితో తీసుకోగా పేలి తల ఛిద్రమైంది. దీంతో కాలనీ వాసులు ఉలిక్కిపడ్డారు. గ్రామస్థులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వేటగాళ్లు ద్విచక్ర వాహనాన్ని అక్కడే వదిలి వెళ్లిపోయినట్లు సమాచారం. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులకు బాలుడు అప్పగింత


బాలుడిని తల్లికి అప్పగిస్తున్న కానిస్టేబుల్

ప్రొద్దుటూరు క్రైం : తప్పిపోయి ఏడుస్తూ కనిపించిన బాలుడిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణంలోని ఆలయాలతోపాటు ఎగ్జిబిషనల్‌లో మూడు రోజుల కిందట ఏఎస్పీ ప్రేరణకుమార్ పోలీస్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి స్థానిక ఎగ్జిబిషన్‌లో మూడేళ్ల మనీష్ తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి ఏడుస్తూ కనిపించాడు. కొందరు వ్యక్తులు గుర్తించి హెల్ప్‌డెస్క్‌లోని పోలీసులకు అప్పగించారు. బాలుడి వివరాలను మైక్‌లో అనౌన్స్ చేసి తల్లి మహాలక్ష్మికి అప్పగించారు.

నాలుగు టిప్పర్లు, జేసీబీ స్వాధీనం

సిద్దవటం : మండలంలోని మూలపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో పెన్నానది నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న నాలుగు టిప్పర్లు, రెండు జేసీబీలను సీజ్ చేసినట్లు కడప డీఎస్పీ షరీఫ్ తెలిపారు. స్థానిక విలేకరులతో డీఎస్పీ బుధవారం మాట్లాడుతూ పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని జే.పి. కంపెనీ సిబ్బంది సెబ్ అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో సెబ్ సిబ్బంది, పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి నాలుగు టిప్పర్లు, రెండు జేసీబీలు స్వాధీనం చేసుకుని, నలుగురు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరో ఇద్దరు డ్రైవర్లు పరారయ్యారన్నారు. కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ ఉరుకుందమ్మ, ఎస్ఐ పురుషోత్తంబాబు, ఎస్ఐ మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గుర్రంకొండ మండలం దిగువ అమిలేపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు జే.సదాశివ(29) కుటుంబ సమస్యలతో పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ములకలచెరువుకు చెందిన మదన్‌మోహన్ భార్య కుమారి(25) కుటుంబ సమస్యలతో బొటెక్స్ మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. నిమ్మనపల్లె మండలం పిట్టావాండ్లపల్లెకు చెందిన మైనర్ బాలిక(15) తల్లి మందలించడంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబసభ్యులు బాధితులను 108 అంబులెన్స్ వాహనాల ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు


గౌరవ వందనం సమర్పిస్తున్న విద్యార్థినులు

కేవీపల్లె : విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జెడ్పీటీసీ సభ్యురాలు గజ్జెల శృతి అన్నారు. కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో ఏపీ షూటింగ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలను ఆమె బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కేవీపల్లెలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి క్రీడలు విజయవంతం చేయడానికి తమ సహకారం ఉంటుంన్నారు. ఎంఈవో మాట్లాడుతూ క్రీడల్లో ప్రావీణ్యం సాధిస్తే ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. పిల్లల్లో మానసిక, శారీరక అభివృద్ధికి క్రీడలు తోడ్పడుతాయని చెప్పారు. వివిధ జిల్లాల నుంచి 450 మంది క్రీడాకారులు పోటీలకు హాజరై మార్చ్‌ఫాస్ట్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గజ్జెల శీన్‌రెడ్డి, రెడ్డి రమేష్‌బాబు, పచ్చార్ల సుధాకర్, వై.వి.రమణ, రమణమ్మ, పరుశురాముడు, వసంత, రమణారెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

వస్త్రాల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్


నిందితులతో సీఐ నారాయణయాదవ్, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం: చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేశారు. మండలంలోని కానపల్లెకు చెందిన గుండ్ర మహేశ్వరరెడ్డి, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన కోట సత్యనారాయణ వస్త్ర వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారం ముగిసిన అనంతరం వస్త్రాలను మన్నోజిరావు వీధిలోని గోదాములో ఉంచేవారు. వ్యాపారంలో నష్టపోయి అప్పులు పెరిగిపోవడంతో సత్యనారాయణ గోదాములోని స్నేహితుడి వస్త్రాల సంచులు దోచుకెళ్లారు. పోలీసులు విచారించి అతడితోపాటు ఆటో డ్రైవర్ శివప్రసాద్‌ను అరెస్ట్ చేశారు. రూ.3.90 లక్షల విలువచేసే వస్త్ర సంచులను సీజ్ చేశారు.

రాష్ట్రాన్ని ఎడారిగా మారుస్తున్న బీజేపీ ప్రభుత్వం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


సంఘీభావం తెలుపుతున్న అఖిలపక్ష పార్టీ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కృష్ణా జలాల పునఃపంపిణీపై గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చి బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఎడారిగా మారుస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. కడపలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో కృష్ణా జలాల పునఃపంపిణీ కేంద్ర ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్, ఆంధ్రప్రదేశ్ భవిష్యత్-సీమ ప్రాజెక్టులపై చర్చ అంశంపై బుధవారం రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో అయితే ఎన్నికలు వస్తాయో అక్కడి ఓట్ల కోసం మోదీ ప్రభుత్వం నిధులు కేటాయించి పక్క రాష్ట్రానికి అన్యాయం చేస్తోందన్నారు. గతంలో కర్ణాటకలో ఎన్నికలు వచ్చినపుడు వివాదస్పద అప్పర్ భద్రను జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి నిధులు కేటాయించిందన్నారు. ఇపుడు తెలంగాణ ఎన్నికల సమయంలో కృష్ణా జలాల పునః పంపిణీపై కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం సబబు కాదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బచావత్ ట్రిబ్యునల్ 811 టీఎంసీలుగా కృష్ణా జలాలను కేటాయించిందని, విభజన సమయంలో ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇపుడు నీటిని మళ్లిస్తే రాబోవు రోజుల్లో రాయలసీమకు చుక్క నీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ ఎన్.తులసిరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంఎ.గఫూర్, బొజ్జా దశరథరామిరెడ్డి, అక్కిని వనజ, ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ఓబులేసు, హరినాథరెడ్డి, జి.ఈశ్వరయ్య పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 50 గొర్రెపిల్లలు మృతి


గొర్రెపిల్లల వద్ద విలపిస్తున్న బాధితుడు గంగయ్య

తొండూరు : మండలంలోని గంగాదేవిపల్లెలో కుక్కల దాడిలో 50 గొర్రె పిల్లలు మృతిచెందినట్లు బాధితుడు గుజ్జల గంగయ్య తెలిపారు. గంగయ్య గొర్రెలను మేతకోసం కొండకు తీసుకెళ్లారు. కుక్కలు దాడి చేయడంతో 50 గొర్రెపిల్లలు అక్కడికక్కడే చనిపోయినట్లు తెలిపారు. మరిన్ని పిల్లలకు గాయాలయ్యాయని, వాటి విలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉంటుందన్నారు. తహశీల్దారు బాలనరసింహులు, వెటర్నరీ వైద్యుడు ఖాదర్‌బాషా నష్టాన్ని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.